# వేదసారమే మురళీనాదము

**అల్ప గురువుల చెంత చేరకు స్వల్పగుణములు చింత చేయకు**
**తలపులన్నియు నిలిపివేసిన - తనువుకెప్పుడు జన్మ లేదు.**
**కన్నువిప్పి చూడరోరన్నా.**

**విద్యార్థులారా!**

భగవన్నామములు రమణీయమైన మనః కమలమునకు భ్రమరములు. మనస్సనే కమలము జలమును ఆధారము చేసుకొని సూర్యకిరణములు ఆధేయముగా భావించి తన జీవితమును అభివృద్ధి గావించుకుంటుంది. భ్రమరములకు మధుకరములని పేరు. దీనిని మరొక మార్గమునందు విచారణ సల్పిన మధు కరము అని రెండు పదములుగా ఏర్పరచుకోవచ్చును. మధువనగా జలము. కరమనగా సూర్యకిరణము. కమలమునకు క్రింద జలము పైన సూర్యకిరణములు లేకపోతే కమలము జీవించలేదు. అదేవిధముగానే భగవంతుని యొక్క నామము మానవుని హృదయమందు జలము అనే ఆధారము, జ్ఞానము అనే కిరణము రెండు అత్యవసరము. ఈ జలమే భక్తి. ఈ కిరణమే జ్ఞానము. భక్తి జ్ఞానములకు మధ్య మాత్రమే మానవుని హృదయమనే కమలము పోషింప బడుతుంది. ఈ భక్తి జ్ఞానములనేవే భగవన్నామములు.

భగవన్నామము మానవుని హృదయ కమలమునకు మధుకిరణములుగా ఏ విధముగా ఏర్పడినవో యశోదకు బలరామకృష్ణులు కూడను ఆ విధముగా ఏర్పడుతూ వచ్చారు. ఈ యశోద ఎవరు? ఏ అభిమానముచేత వారి లాలించి, పాలించి పోషిస్తున్నది యశోద? వీరి విషయములో లోతుగా దిగి విచారించినప్పుడే ఈ అంతరార్థము బోధపడుతుంది నిజముగా యోచించిన బలరామకృష్ణులు యశోద బిడ్డలు కారు. వీరెక్కడ నుంచి వచ్చారు అనికూడ ఆమెకు తెలియదు. అయినప్పటికి వారిని తన కన్నబిడ్డలవలె ప్రేమించి లాలించి పోషిస్తూ వచ్చింది. బలరామకృష్ణులు మధురయందు జీవించేవారు. వారు ఈ గోకులము రావటానికి

sri sathyasai vachanamrutam

కారణము ఏమిటి? ఈ గోకులములో యశోద ఇల్లు చేరటానికి కారణం ఏమిటి? ఆధ్యాత్మిక మార్గమునందు వీనిని చక్కగా విచారణ చేసినప్పుడు గోకులము యేమిటి, యశోద ఎవరు, మధుర ఏది, ఈ బలరామకృష్ణులకు తల్లి ఎవరు వీరు ఎక్కడ ఆవిర్భవించారు అని విచారణ చేస్తే భగవన్నామమనే రామనామము నాభి స్థానము నుండి ప్రారంభమవుతుంది. ఈ నాభి స్థానమే మధుర. శక్తి స్థానమైన శబ్దమే దేవకీదేవి. ఆమె గర్భమునందు జన్మించినవారే ఈ బలరామకృష్ణులు. గోకులము అనే నోటిలో చేరి యశోద అనే నాలుకపైన ఈ భగవన్నామమనే బలరామకృష్ణులు పోషింపబడుతూ వచ్చారు. కనుక బలరామకృష్ణులనే భగవన్నామము నాలుకపై నాట్యమాడుతూ వచ్చింది. భగవన్నామమనేది ఏ విధంగానైనను భగవంతుని బంధించవచ్చును.

కామధేనువు మెడకు త్రాడు కట్టి ఒక గూటమునకు కట్టివేసిన ఆ కామధేనువు కదలక మెదలక నిలచిపోతుంది. ఈ కామధేనువే భగవంతుడు. సమస్త అభీష్టములను అందించేవాడు కామధేనువు వంటి భగవంతుడు. అతని మెడకు ప్రేమ అనే పాశము కట్టి నాలుక అనే గూటమునకు తగిలించినప్పుడు భగవంతుడు అక్కడనే నిలిచిపోతాడు. కనుకనే భగవంతుని నామము రూపము బంధించే ప్రేమ ప్రాశము. ఇట్టి పవిత్రమైన నామ తత్త్వాన్ని మనము గుర్తించుకొనలేక నామిని చూడలేక (నామి అనగా రూపము) భౌతికమైన జగత్తునే భ్రమించి, దానినే వరించి, తరించలేకపోతున్నాము. వరించవలసినది భగవంతుని, తరించవలసినది జీవతత్త్వము. ప్రేమించవలసినది ప్రేమతత్త్వాన్ని. ఈ సత్యాన్ని మానవుడు ఈనాడు గుర్తించలేకపోతున్నాడు.

దీనినే రామనామ తత్త్వమునందు పవిత్రమైన ఓంకారమునకు పోల్చుకోవచ్చు. ఓంకారమనేది దివ్యమైన ప్రణవ శబ్దము. అకార, ఉకార, మకారముల చేరికయే ఓంకారము. అకారమే లక్ష్మణుడని, ఉకారమే భరతుడని, మకారమే శత్రుఘ్నుడని ఈ మూడు శబ్దములు చేరిన ఓంకారమే రాముడని నిరూపిస్తూ వచ్చింది. రామ అనేది ఆత్మకు సంబంధించిన నామముగాని అన్యమునకు సంబంధించినది కాదు. ఆత్మా రామ అనేది భారతీయులు నిరంతరము ఉచ్చరిస్తూ వచ్చారు. రమింపచేసేది కనుకనే దీనికి రామ అని పేరు. దీనికి

srisathyasaivachanamrutam

సంఖ్యాశాస్త్రమునందు ప్రత్యేకమైన అర్థము ఉన్నది. నామ అనేది రెండక్షరములు కాదు. మూడక్షరములు. న,అ,మ నామ. సంఖ్యాశాస్త్రములో న=0, అ=2, మ=5 న+అ+మ = 0+2+5 = 7. దీనినే సప్త స్వరములుగా భావిస్తూ వచ్చారు. దీనిని సంగీత శాస్త్రమును ఆధారముగా తీసుకుంటూ వచ్చారు. అవే స,రి,గ,మ,ప,ద,ని ఏడు శబ్దములు. దీనిని ఆధారము చేసుకొని సప్తసముద్రములు, సప్తఋషులు, సప్తదినములు, సప్తాహము ఈ విధముగా ప్రారంభిస్తూ వచ్చారు. భగవన్నామము గురించి ఎంతైనా చెప్పటానికి వీలుంటుందాది. జగత్తాంతా భగవన్నామముతో నిండినటువంటిదే. అంతయు శబ్దరూపమైన తత్త్వమే. అలాంటి శబ్దరూపమైన భగవత్స్వరూపాన్ని మనము ఈనాడు గుర్తించుకోలేక పోతున్నాము. భగవన్నామమును ఉచ్చరించాలంటే ఏదో అలక్ష్యముగా మనము కాలమును వ్యర్థము చేస్తున్నాము. సంకీర్తన మనేది జీవితమునకు చాలా ప్రధానమైనది. జీవితమునకు చాలా ఆధారమైనది. మన దేహమునకు వెన్నెముక ఎట్టి ఆధారమో జీవితమునకు నాదము అట్టి ఆధారము. ప్రతి శబ్దము భగవన్నామముతో కూడినదే. మన ఉచ్ఛ్వాస నిశ్వాసములు కూడను భగవన్నామముతో కూడినదే. సోఽహం సోఽహం సోఽహం అదీ భగవన్నామమే. అదే దైవత్వమునకు మూలాధారము. మానవ జీవితమంతయు దైవశబ్దములచే ఆధారపడి ఉంటున్నాది. అయితే ఈనాటి మానవులు అనేక విధములైన మార్గములను అనుసరించి అనేక విధములుగా స్మరిస్తూ వస్తున్నారు.

**సంకీర్తన విభాగములు**

ఈ సంకీర్తనలందు నాలుగు విధములుంటున్నవి. గుణసంకీర్తన, లీలా సంకీర్తన, భావసంకీర్తన, నామసంకీర్తన. అని ఇవి నాలుగు విధములు. గుణ సంకీర్తనమనగా భగవంతుని మంగళకరమైన గుణ విశేషములను మాత్రము వర్ణించేది. ఆనాటి మహర్షులు, ఆనాటి కవులు అనేక విధములుగా భగవంతుని గుణములను వర్ణిస్తూ వచ్చారు.

**వాసుకి శయన శ్రీనివాస చిద్విలాస భవపాశముల ద్రుంచి**
**మనోల్లాసమివ్వరా**
**భాసుర కళ్యాణ పురవాసుడౌచు శేష గోపదాసుని జగదీశ హృషికేశ వేగ**

srisathyasaivachanamrutam

**శ్రీరమారమణీ మనోహరా.**

ఈ విధముగా ఆ గుణాలను వర్ణిస్తూ వచ్చారు. ఇంక లీలా గుణగణ విశేషములు.

**సందుగొందులందు మరి అందరందు నీవే**
**ఆనందమొందు చుందువని విందు శ్రీధరా!**
**ఇందువదనా సురేంద్ర వందిత పాదారవింద**
**నిత్యవందనంబు నీకు చేసెద శ్రీరమారమణీ మనోహరా!**

ఇంక భావ సంకీర్తన

**మేటియౌ త్రికూట పీట సాటి యెవరి యేటి రాజుపేట**
**నేలుచున్న కపటనాట కాధారా ఆటలపాటల మృదుమాటలచే**
**భోజరాజు మాటికి పిలిచిన పలుక వేటికి శ్రీ వేంకటేశ**
**శ్రీ రమారమణీ మనోహరా!**

ఈ గుణ సంకీర్తనమునకు లీలా సంకీర్తమునకు, భావసంకీర్తనమునకు అనేక విధములైన మార్పులు కలుగుతూ వస్తున్నాయి. కానీ నామ సంకీర్తనము మాత్రము అన్నింటికంటె ఉత్తమమైనదని నిర్ణయం చేస్తూ వచ్చారు.

నామమును మానవత్వముగా భావించటం కాకుండా, మాధవత్వముగా నిరూపించి అతనే శబ్దస్వరూపుడు అని వర్ణిస్తూ వచ్చారు.

**శబ్దబ్రహ్మమయీ చరాచరమయి జ్యోతిర్మయీ వాఙ్మయీ**
**నిత్యానందమయీ పరాత్పరమయీ మాయమయీ శ్రీమయీ.**

ఈ అష్టవిధములైన స్మరణకు శబ్దమే ప్రధానమైనది. ఈ శబ్దమును భావరూపములో ఇముడ్చుకొని దైవత్వమును పొందుటకు అనేక విధములైన మార్గములు ఏర్పరచుకున్నారు.

దీన్నే శాంతభక్తి, సఖ్యభక్తి, వాత్సల్యభక్తి, అనురాగభక్తి, మధురభక్తి అని. శాంతభక్తి. ఈ భక్తితో భగవంతుని పొందినవారు ఎవరు జగత్తులో. మహా కఠినమైన దీక్షను పట్టిన భీష్ముడు. ఇతను గంగాపుత్రుడు. జగత్తు నిమిత్తమై తాను సర్వముఖములను త్యాగము చేసినవాడు. భీష్మ ప్రతిజ్ఞ గావించినవాడు. శారీరక, మానసిక జీవితమును త్యాగము గావించి

sri sathyasai vachanamrutam

దివ్యత్వమును పొందిన మహాత్యాగి. కట్టకడపటికి దేశోద్ధరణ నిమిత్తమై తాను నాయకత్వమును వహించి భారతయుద్ధము లోపల పాండవులపై యుద్ధము చేసినవాడు. తొమ్మిదవదినము అర్జునుడు వేసిన అంబులచేత తాను కూలిపోయాడు. శరీరమంతా ఈ అంబులుచేరి ఉంటున్నాయి. దేహము భూమిపైన పడలేదు. అంతా అంబులపైనే ఆధారపడి ఉంటున్నాది. దానినే శరతల్పము అన్నారు. అనగా శరముల పాన్పుగా తయారైంది. తిరిగి అదే అర్జుననే కోరినాడు. అంత శాంత మూర్తి. ఎవరు తనను నేలకూల్చినారో ఆ అర్జుననే కోరినాడు.

అర్జునా నాకు బెడ్‌ను మాత్రం తయారుచేశావు కాని నాకు పిల్లో ఇవ్వలేదే తలక్రిందకు పడిపోతున్నాది. అంబులను తిరిగి ఇట్లా వేసి ఈ మధ్యభాగములో తలపెట్టినాడు. అయితే సకాలమున మరణము ప్రాప్తించినప్పుడే నా జన్మ సార్థకమవుతుంది అని అతని విశ్వాసము. ఆనాటి మొదలు ఉత్తరాయణ కాలము వచ్చేంతవరకు యాభైఆరు దినములు భగవచ్చింతన చేస్తూ కూర్చున్నాడు. దేహమునకు ఎన్ని బాధలు సంభవించినా, ఎన్ని గొప్పలు తనను బాధించినను ఈ దేహమును లెక్క చేయలేదు. పవిత్రమైన కాలము నాకు ప్రాప్తించాలి. అంతవరకు నేను ఈ ప్రాణములు వదలకూడదు. ప్రాణములు చాలా విలువైనవి. ఇలాంటి విలువైన నా ప్రాణమును విలువైన కాలములోనే వదలాలని ఆ అంబులశయ్యపైననే యాభైఆరు దినములు పవళించినాడు. ఈ కాలము వృథా చేయకూడదని రాజనీతి, గృహనీతి, శాంతిబోధలు ఇతరులకు చేస్తూ వచ్చాడు. దీనినే శాంతి పర్వమని మహాభారతమందు ఉచ్చరించారు.

పాండవులకందరికి వారియొక్క గుణ గణ విశేషములన్నింటిని చక్కగా వర్ణిస్తూ వచ్చాడు. ఇలాంటి నిగ్రహశక్తి కలిగిన మహా పురుషుడు భీష్ముడు. దీనికంతయూ కూడను అతని శాంత భక్తియే మూలాధారము. ఎన్ని కష్టములైనా, ఎన్ని నష్టములైనా, ఎట్టి నిందలైనా, ఎట్టి నిష్ఠూరములైనా కూడను సహించి భరించి భగవంతుని స్మరించేవాడు. ఆ యుద్ధ సమయమునందు కృష్ణుడే భీష్ముని చంపటానికి వచ్చాడు. నిజముగా భీష్ముణ్ణి కొట్టటానికి ఇష్టం లేదు కృష్ణునికి. అర్జునుడు బలహీనుడై పోవటంచేత అర్జునునికి కొంత వీరత్వమును బలపరిచే నిమిత్తమై అర్జునా! నీవు పిరికిపందవలె ఉంటున్నావు. నేనే యుద్ధము చేస్తానని తాను అంబులు తీసుకున్నాడు. అనగా అర్జునునకు కేవలము బలము నందించే నిమిత్తమై ఆ



srisathyasaivachanamrutam

కృష్ణుడు వస్తుంటే భీష్మునిపైన, భీష్ముడు ఆ సమయమునందు కూడను కృష్ణుని ప్రార్థిస్తూ వచ్చాడు.

**కుప్పించి యెగసిన కుండలంబులకాంతి**
**గగన భాగం బెల్ల కప్పిగొన**
**నుఱికిన నోర్వక యుదరంబు లోనున్న**
**జగముల వ్రేగున జగతి గదల**
**చక్రంబు చేబట్టి చనుదెంచురయమున**
**పైనున్న పచ్చని పటము జాఱ**
**నమ్మితి నాలావు నగుబాటు సేయక**
**మన్నింపుమని క్రీడి మరల దిగువ**
**కరికి లంఘించు సింహంబు కరణి మెఱసి**
**నేను భీష్ముని జంపుదు నిన్నుగాతు**
**విడువు మర్జున యనుచు మదిశిఖవృష్టి**
**దెరలి చనుదెంచు దేవుండు దిక్కునాకు.**

ఓ అర్జునా! నేనిప్పుడు ఈ భీష్ముని చంపుతాను. నన్ను విడిచిపెట్టు అన్నాడు. భీష్ముడు నన్ను చంపటానికి ఏ భగవంతుడైన కృష్ణుడు వస్తున్నాడో ఆ కృష్ణుడే నన్ను రక్షించాలి అన్నాడు. చూశారా! ఎంత భక్తో. ఏ భగవంతుడు నన్ను చంపటానికి వస్తున్నాడో ఆ భగవంతుడే నన్ను రక్షించాలి అని ప్రార్థిస్తూ వచ్చాడు. శిక్షించటానికి వస్తున్నాడు. ఓ రామా నన్ను రక్షించు. ఓ ఈశ్వరా నన్ను రక్షించు అని ఎవర్నీ ప్రార్థించలేదు. అంతటి నిశ్చల భక్తి నిర్మల భావము. అదే శాంత భక్తి.

**సఖ్య భక్తి**

ఇక సఖ్య భక్తి. అర్జునుడు ఎంత కాలమునుంచి మిత్రత్వముతో ఉన్నప్పటికిని కృష్ణుడంతటి స్నేహితుడు ఈ జగత్తులో నాకు లేడని విశ్వసించాడు. కృష్ణభావమునందు తన జీవితమును స్నేహభావముతో అనుభవిస్తూ వచ్చాడు. లోకము మరొకరీతిగా భావిస్తుందని కృష్ణుని బావా బావా అంటూ పిలుస్తూ వచ్చాడు. కృష్ణునికి ఆ విధముగా relationship పెట్టుకోవటం



srisathyasaivachanamrutam

ఇష్టం లేదు. నన్ను బావా అని పిలుస్తున్నావేగాని బావకు తగిన అర్థము లేదే అక్కడ. ప్రతి పదమునకు ఒక అర్థాన్ని నిరూపించాలి అనే ఉద్దేశ్యముతో ఈ బావ అనే పదమునకు విలువనిచ్చే నిమిత్తమై తన సోదరియైన సుభద్రనిచ్చి పెండ్లిచేసి అప్పుడు బావా అనిపించుకున్నాడు. ఇప్పుడు నీవు బావా అని పిలు అన్నాడు. అర్థములేని పదమును ఉపయోగపెట్టకూడదు. ఇది భగవంతుని చరిత్రలోవున్న యదార్థమైన పవిత్రత. కష్టములయందు, సుఖములయందు, అపజయములందు, జయములందు అరణ్యవాసమునందు నిరంతరము కూడను కృష్ణుడే మా స్నేహితుడు. కృష్ణుడే నా మిత్రుడు. ఇదే సఖ్యత. కష్టములందు దూషించటము, సుఖములందు వర్ణించటము ఇది కాదు నిజమైన సఖ్యత. ఎన్ని కష్టములైనా సరే, ఎన్ని బాధలైనాసరే, ఎన్ని విధములైనా హింసలైనా సరే నీవు తప్ప నాకన్యము లేదు అనే విశ్వాసముతో కృష్ణుని ఆధారము చేసుకున్నాడు అర్జునుడు. రెండు దేహములు ఒక ప్రాణము. ఇది నిజమైన స్నేహము. ఈ విధముగా అర్జునుడు మైత్రిగా చూసుకుంటూ వచ్చాడు.

**హనుమంతుని భక్తి**

ఇక దాస్యమునకు హనుమంతుడు. ఎప్పుడు చూసినా నీవు ప్రభువు నేను దాసుడను. నీవు ప్రభువు నేను దాసుడను అనేవాడు. ఒకానొక సమయము లోపల లంకను దాటక పూర్వము మంచిపండు వెన్నెల లోపల అందరు పవళించారు. శ్రీరాముడు కూడను పవళించాడు. ఎక్కడ పవళించగలడు? అక్కడ పరుపులు లేవు. ఇసుక. జటాజూటమును ధరించి యతి వేషముతో బయలుదేరినాడు రాముడు. లక్ష్మణుడు కూర్చున్నాడు. అతని తొడపైన తలపెట్టి రాముడు పవళించాడు. ఒక్కొక్కరినీ ప్రశిస్తూ వచ్చాడు రాముడు. 'సుగ్రీవా! ఆ చంద్రుని లోపల ఏదో నల్లని మచ్చ కనిపిస్తున్నాదే దాన్నే మంటావు నీవు' అన్నాడు. 'నాకు తెలియదు రామా' అన్నాడు. ఇంకా జాంబవంతుని ప్రశ్నించాడు. జాంబవంతుడు చెప్పాడు. ఆ చంద్రుని లోపల అనేక పర్వతములు గుంతలు ఉంటుంటాయి. ఆ గుంతలు, పర్వతములు నీడనే ఆ నల్లటి రూపముగా కనిపిస్తున్నాది అన్నాడు. జాంబవంతుడు జ్యోతిశ్శాస్త్రంలోను, ప్రకృతి శాస్త్రములోను, భూగోళ శాస్త్రమును చక్కగా గుర్తించినవాడు. ఇంకా కొంతమంది అట్లనే జింకవలె కనిపిస్తున్నాది. మృగాలవలె కనిపిస్తున్నాది అన్నారు.

srisathyasaivachanamrutam

ప్రక్కనున్న కాళ్లు వత్తుతున్న హనుమంతుని 'ఆ చంద్రుని లోపల నీవేమి చూస్తున్నావు హనుమా' అన్నాడు 'రామా! అన్యము నాకేమీ కనిపించటం లేదు. నీవు వెల్లకిలా పండుకొని చూస్తుంటే నీ ముఖము యొక్క చిత్రమే చంద్రుడనే అద్దములో కనిపిస్తుండాది' అన్నాడు. చంద్రుడనే వాడు శుద్ధమైన అద్దము వలె కనిపిస్తున్నాడు. ఆ అద్దములో నీ ప్రతిబింబమే కనిపిస్తున్నాది అన్నాడు. అనగా ప్రతి పదార్థమునందుకూడను శ్రీరామచంద్రుని స్వరూపము నామమే అతనికి కనిపిస్తూ వచ్చింది. ఎలాంటి సమయమునందును రామసేవ తప్ప అన్యము చేసేవాడు కాదు. అతను మహా బలవంతుడు, మహా గుణవంతుడు, మహా శాంతుడు. ఇట్టి హనుమంతుడు అశోకవనములో ప్రవేశించాడు లంకనంతా ధ్వంసము చేస్తూ వచ్చాడు. రావణుడు ఎవడురా నీవు అని ప్రశ్నించినప్పుడు బలవంతుడైన హనుమంతుడు అహంకారముతో విఱ్ఱవీగ లేదు. దాసోహం కోసలేంద్రస్య. నేను శ్రీరామచంద్రుని దాసుడను అన్నాడు. దాసునికే ఇంత బలము ఉంటుంటే ఇక ప్రభువునకు యెంత బలమో యోచించుకో రావణా అన్నాడు. నిరంతరము దాసత్వాన్ని భావించే ఇట్టి హనుమంతునికంటె ఆదర్శవంతమైనవాడు మరొకడు లేదు. అందుకోసమనే రాముడు భారతదేశము కృతజ్ఞతకు పుట్టినిల్లు పెట్టిన పేరు అన్నాడు. కృతజ్ఞత లేకపోతే మానవత్వమే లేదు.

ఒంటరిగా తీసుకుని పోతున్న సీతను రక్షించే నిమిత్తమై జటాయువు తన ప్రాణాన్ని అర్పించింది. కనుకనే తన సీతకు సహాయం చేసిన జటాయువుకు కృతజ్ఞతరీతిగా దాని కర్మలన్నీ ఆచరిస్తూ వచ్చాడు. హనుమంతునికి కూడా అంతే. హనుమా! నీకు ఏ విధంగా కృతజ్ఞత చెప్పాలో నాకర్థం కావటం లేదు. కిష్కింధలో ఉన్న నాయొక్క క్షేమవార్త అశోక వనములో వున్న సీతకు అందించినది నీవే. అశోక వనములో బాధచెందుచున్న సీత వార్త రామునకు అందించినవాడవు నీవే. అడవులన్నియు శోధించి, సాధించి, సముద్రములు దాటి సీతను చూచి వచ్చినవాడవు నీవే. సీత జీవముతో ఉన్నదనే పవిత్రమైన వార్తను తెలిపినవాడవు నీవే. నా ఉంగరము సీతకిచ్చి, సీత శిరోమణిని నాకందించిన వాడవు నీవే. రఘుపతి కార్యము ఈడేర్చిన ఓ కపి శిఖామణి! నీకు ఏరీతిగా కృతజ్ఞతలు తెల్పాలి? నా దగ్గర యేమీ లేదు. నన్ను నేనే ఇచ్చుకుంటున్నాను హనుమా తీసుకో అన్నాడు తాను సముద్రము దాటటానికి రామనామమే ఆధారమైంది. నామముయొక్క మహత్తర శక్తి ఎట్టిదో చక్కగా గుర్తించవచ్చు. ఇదీ దాస్యమునకు

sri sathyasai vachanamrutam

సరైన అర్థము. ఒక్క తూరి అర్పితమైపోతే ఇంక ప్రాణము పోయినాసరే నా జీవితమంతా నీకే అర్పితము అనేరీతిగా అర్పితము గావించినవాడు హనుమంతుడు. ఇది దాసత్వము.

ఇంక వాత్సల్యము. ఈ వాత్సల్యములో ఉండిన మాయాతత్త్వము ఎవ్వరూ అర్థం చేసుకోలేరు. కృష్ణుని నోటియందు 14 లోకములు చూసిన యశోద మాయచేత ఇతను నా కుమారుడే ఇంత గొప్ప లోకాలు నా కుమారుని చిన్న నోటిలో ఎట్లు కనిపిస్తాయి అని తాను చూచినదాన్ని మరచింది. వాత్సల్యము కేవలము దేహ సంబంధముగా ఉంటుంది. నేను తల్లిని, తాను కుమారుడు అనే వాత్సల్యమే మాయ ఇంత గట్టిగా అందిస్తూ వచ్చింది. గోవర్ధనగిరి ఎత్తి కృష్ణుడు గోవులను, గోపాలురను కాపాడుతున్న సమయములో అయ్యో! ఎంత పర్వతమును ఎత్తినాడే. దీనిని క్రింద ఏరీతిగా పెట్టగలడు? ఏ విధముగా క్రింద పెట్టాలనుకున్నప్పటికి ఈ పర్వతము మధ్యనున్న తాను క్రిందకి పడిపోతాడోయేమో. ఎత్తటం సులభము కావచ్చును కాని క్రింద పెట్టటం చాలా కష్టం అనుకొని అందరు వెళ్లిపోయినప్పటికిని యశోద అక్కడనే కాచుకొని ఉండినది. ఇక్కడ కూడను ఒక మాయనే. కృష్ణుడు ఒక పెద్ద శబ్దము వచ్చేటట్లు సృష్టించాడు. ఆ శబ్దమును భరించుకొనలేక కన్నులు చెవులు మూసుకున్నది యశోద. ఆమె కన్నులు చెవులు మూసుకున్న తక్షణము భూమిపై ఉంటున్నాది పర్వతము. తాను ప్రక్కనున్నాడు. ఏరీతిగా ఎత్తాడో ఆ రీతిగానే దింపినాడు. ఇంత యోచనకు ఆమె ఏమాత్రము లోతుగా పోలేదు. ఎత్తిన పరమాత్ముడు దింపలేడా అనే విచారము లేకపోయింది. ఈ నిత్యానిత్య విషయ పరిశీలన ఎప్పుడు పోతుంది. వాత్సల్యము లోపల నిర్మూలనమౌతుంది ఈ విచార చర్చ. ఉద్ధవుడు వచ్చి కృష్ణుని వార్తలు చెపుతున్నప్పుడు యశోదవెళ్ళి ఉద్ధవా! నా గోపాలుడు బాగున్నాడా? అని ప్రశ్నించింది. లీలామానుష విగ్రహుడు, బృందావన విహారి, ముని మానస సంచారి ఏవిధముగా పోయినా నాకక్కర లేదు. నా గోపాలుడు బాగున్నాడా లేదా? అని అడిగింది. కనుక వాత్సల్యమనేది సంకుచిత స్థానానికి తీసుకుని వస్తుంది. ఆమెకు ఏ విధమైన వర్ణనలు అక్కరలేదు. గోపాలా! గోపాలా! అని పిలుచుకునేది. భక్తులు ఎన్ని వర్ణనలు చేసుకున్నను తనకక్కర లేదు. తను కావలసింది గోపాలుడే. నిరంతరము గోపాలా గోపాలా అనే నామముచేత యశోద వాత్సల్యము చేత తరించింది.

sri sathyasaivachanamrutam

**అనురాగభక్తి**

ఇంక అనురాగ భక్తి గోపికలు. వాళ్లకు రెండు గుఱ్ఱాల సవారి. ఇంటిలోపల భర్త, అత్త. బయట గోపాలుడు. ఈ రెండు తప్పయేమాత్రము మరొక చింత లేదు. తమ కర్తవ్యాన్ని నిర్వర్తిస్తూ దివ్యత్వాన్ని అనుభవిస్తూ వచ్చారు వాళ్లు. ఒక్కొక్క సమయము లోపల జగత్సంబంధమైన ఈ కర్తవ్యములో వారు కొంతవరకు తప్పిపోతూ వచ్చారు. నిరంతరము కృష్ణా కృష్ణా అంటూ ఈ విధముగా అనురాగ భక్తి. తమ స్నేహితుడుగాను, మిత్రుడుగాను, సర్వశక్తిగాను భావించినవారు గోపికలు. మధుర భక్తి ఒక్క రాధకు తప్ప అన్యులకు లేదు. కృష్ణా! అనుకునేటప్పటికి తన దేహమును తాను మరచిపోయేది. కృష్ణుడు పతి తాను సతి అను భావముతో మునిగిపోయేది. కృష్ణుడు మాస్టరు తాను సర్వెంటు అనే భావముతో ఉండేది. ఇరువురు కూడను ఒక్కటే. ఆయన పరమాత్మ నేను ప్రకృతి అనేరీతిగా ఉండేది. మరొక చింత లేదు. ఎక్కడ నీలంగా కన్పించినా వృక్షమైనప్పటికిని కృష్ణా అని పోయి వృక్షాన్ని పట్టుకొనేది. నిరంతరము సమస్త పదార్థముల యందు కృష్ణుడు తప్ప అన్యము కనిపించలేదు. నిరంతరము కృష్ణనామము, కృష్ణ మురళీగానమే. ఆమె ప్రాణం విడిచే పూర్వము ఆ మురళీ నామమునే వినాలని కోరింది. నాదం కూడా ఎటువంటి పవిత్రమైన సారమో తెలుసునా? పరిపూర్ణమైన వేదసారమే ఈ మురళినాదము. ఈ వేదముల యొక్క సారమంతా గోక్షీరమే.

ఆమె అన్నపానాదులను వదలిపెట్టింది. అస్థి పంజరమయింది శరీరము. కేవలము వెదరుపొదల లోపల చేరిపోయింది. యమునా తీరములో నిల్చిపోయింది. కాని ఆమెను రక్షించే నిమిత్తమై కట్టకడపటి స్థితి లోపల కృష్ణుడు అక్కడకు వెళ్ళాడు. రాధా నీకేమి కావాలి అని అంతిమ కోర్కెను ఉచ్చరించమన్నాడు. చెప్పింది 'కృష్ణా యింత కాలము నాయొక్క హృదయకమలములో నిన్ను పెట్టుకొని పోషించుకున్నాను. నా హృదయమనే కొలను లోపల ప్రేమ జలమంతా ఆరిపోయింది. కట్టకడపటికి నాకంటి ధారలనే జలములో పెట్టి పోషించుకున్నాను. కంటి ధారలు కూడను ఆరిపోయాయి. నిన్ను ఎక్కడ పెట్టుకొని పోషించాలి? శబ్దమునందే నీ నామమును నేను పోషించుకోవాలి అని పాట పాడుమా కృష్ణా.

**వేదసారమంత తీసి నాద బ్రహ్మముగను మార్చి**

srisathyasaivachanamrutam

**వేణువందు తిరుగబోసి గాన రూపముగను మార్చి**
**పాటు పాడుమా కృష్ణా పలుకు తేనె లొలుకునటుల**
**మాటలాడుమా ముకుంద మనసు తీరగా..**

అని కన్నులు మూసుకుంది. ఆమెలోని జ్యోతి కృష్ణునిలో ప్రవేశించింది. మధుర భక్తి అనగా రెండు ప్రాణములు ఒక్కటే అనే అంతరార్థమును రాధ నిరూపించింది. ఈ రకమైన స్థితిని పొందటానికి కారణము ఏమిటి? నిశ్చలమైన భక్తి, నిర్మలమైన ప్రేమ, నిస్వార్థమైన హృదయము ఈ మూడే దీనికి మూలకారణము. తన్, మన్, ధనమును అర్పితము గావించింది ఈ రాధ. ఈ తనువు ఎవరిది. ఈ మనస్సు ఎవరిది, ఈ ప్రాణమెవరిది. ఈ మూడింటిని నీవు అందించినవే.

దీనిని సంస్కరించే నిమిత్తమై భక్తి అనేది ఉద్భవించింది. 12th class boy చెప్పాడు transformation అని మార్పురావాలి. మార్పు రావాలనుకున్నప్పుడు దీనికి అనేక రకములైన శిక్షలు జరగాలి. ఒక గుండును చక్కగా రూపంగా తయారు చేసినప్పుడు శిల్పి దానిని అనేక రీతులుగా కొట్టాలి. ఉలితో సుత్తితో దానిని చక్కగా తీర్చిదిద్దాలి. అప్పుడే రూపరహితమై గుండు ఒక సుందరమైన విగ్రహముగా తయారౌతుంది. దీనినే సంస్కారము అంటారు. కేవలము ఒక కట్టగా పడి ఉన్నదానిని కుర్చీగా తయారు చేయాలంటే ఎన్ని విధాల దీనిని సంసస్కరింప చేయాలి. ఉలితో కొట్టి అనేక రకములుగా దీనిని తీర్చిదిద్ది ములికలు వేసి బిగించి సానబెట్టి ఇన్ని విధముల చేసినప్పుడే ఇది అనుకూలమైన chairగా తయారౌతుంది.

ఒక ముద్ద బంగారము తెచ్చి నగగా తయారు చేయాలంటే అగ్నిలోవేసి సుత్తితో కొట్టి దానిని అన్ని రకములుగా సంస్కరించినప్పుడే అది సుందరమైన నగగా తయారౌతుంది. ఇదే సంస్కారము అంటే. ఈ విధమైన transformation చేసినప్పుడే విలువైనదిగాను అనుకూలవంతమైనదిగాను రూపొందుతుంది. ఆ పదార్థము. సమస్త పదార్థములు సంస్కరింప బడుతున్నాయిగాని మానవుడు సంస్కరింప బడటం లేదు. ఒక కట్టనైనా అనుకూలవంతమైన రూపంగా తీర్చి దిద్దవచ్చు. ఒక గుండునైనా చక్కని రూపముగా చేయవచ్చు. వడ్లను పొట్టు తీసి బియ్యముగా తయారుచేసి వండుకొని భుజించవచ్చు. మార్కెట్టు నుండి కూరగాయలు

srisathyasaivachanamrutam

తెచ్చి ఉప్పు కారం పులుసు వేసుకొని సాంబారు, రసం చేసుకొని చక్కగా ఆరగించవచ్చు. కానీ సంస్కారమునకు మానవుడు సిద్ధముగా లేడు. ఇంక వాడెట్లా ఉత్తమ మానవుడుగా తయారౌతాడు. ఏ కష్టములు తనకు ఉండకూడదు. ఏ బాధలు తనకు కలుగకూడదు. అన్ని విధములైన అనుకూలములు ఉంటుండాలి. ఉత్తమ స్థానములోకి పోయి చేరాలి. ఎట్లు చేరుతాము. ఇది కేవలము అల్పబుద్ధులకు కలిగిన భావము. కనుకనే ఆనాటి సాధకులందరు కూడను త్యాగము చేసి ఎన్ని కష్టములకైనా నష్టములకైనా విచారములకైనా నిందలకైనా నెట్టుకొని ముందుకు సాగుతూ వచ్చారు. ఈ విధమైన దీనికి మనము సహించి భరించినప్పుడే ఓ సాధకునిగా మనము రూపొందుతాము.

**శక్తి సంస్కరణ చాలా అవసరము**

కనుక ఈనాటి లోకము లోపల మానవ సంస్కారము అత్యవసరము మానవునిలో మార్పు కలుగకుండా జగత్తు ఏమాత్రము కూడను మార్పు కలుగదు. జగత్తంటే మనకంటికి కనిపించేది కాదు. జగత్తు అనగా జనముతో కూడినదే జగత్తు. కనుక మానవులు ఉంటేనే ఇది జగత్తవుతుంది. మానవులు లేనిది జగత్తే లేదు. కనుక అట్టి మానవుని మంచివానిగా తీర్చిదిద్దాలి. మానవుడు మారినప్పుడే జగత్తు మారిపోతుంది. వ్యక్తి మారినప్పుడే సమాజము మారుతుంది. కనుక ఈనాటి మానవుని మనస్సు సంస్కారముతో కూడి ఉండాలి. ఈ మనస్సును అనేక రకములైన శిక్షణలకు గురిచెయ్యాలి. కనుక సమస్త చదువులు మానసిక సంస్కారము నిమిత్తము ఏర్పడినవే. నీవు ఒక బి.ఏ లేక ఎం.ఏ డిగ్రీ తీసుకోవాలంటే ఎంత శ్రమపడుతున్నావు. కేవలము పొట్టకోసం సంపాదించే ధనము కోసమే నీవు ఇంత శ్రమ పడుతున్నావు. భగవంతుని పొందాలంటే నీవు ఏమి శ్రమ పడుతున్నావు. ఏమీ లేదు.

సులభముగా చిక్కాలి భగవంతుడు. కాలు గడపదాటకూడదు. కాసు ఖర్చు కాకూడదు. కాయము కదలకూడదు. కైవల్యము వచ్చి ఒడిలో పడాలి. ఈనాటి మానవుని యొక్క కోరికలు. ఇది కేవలము సోమరత్వమునకు గుర్తు. కాయమును శ్రమింప జేయాలి. కాలమును సార్థకము గావించాలి. కర్మలు ఆచరించాలి. భగవన్నామమును స్మరించాలి. సంపూర్ణ విశ్వాసముతో అర్పితము కావాలి. అప్పుడే జీవితమునకు, దేశమునకు తగిన శాంతి భద్రతలు సమకూర్చిన

sri sathyasai vachanamrutam

వారమౌతాము. మొట్టమొదట వ్యక్తి తయారు కావాలి. తరువాత సమాజము తయారుకావాలి. మూడవది దేశము తయారుకావాలి. వ్యక్తి కానిదే సమాజము ఎక్కడ వస్తుంది. సమాజము లేకుండా దేశము ఎక్కడ ఉంది?

కనుక ప్రతివ్యక్తి కూడను సంస్కరింపబడాలి. అలాంటి transformation రావటం కోసమే ఈ సంస్థను మేము స్థాపించాము. అట్టి transformation రాకపోతే ఉండి ప్రయోజనం ఏమిటి? అలాంటి జీవితము గడపకూడదు. వచ్చినందుకు సాయిబాబాను పట్టినందుకు ఈ Instituteలో చేరినందుకు సార్థకమైన వ్యక్తిగా నీవు ముందుకు పోవాలి. చెడిపోయిన కారులు workshopలో విడిచిపెట్టినప్పుడు ఆ workshopలో దానిని ఎన్నో రకములుగా తీర్చిదిద్దుతారు. పాత bolts తీయటము కొత్త bolts వేయటము. పాత scrwes తీయటము క్రొత్త screws వేయటము. పాత nuts తీయటము క్రొత్త nuts వేయటము. ఈ విధముగా అన్నీ క్రొత్తవిగా చేసుకొని బయటకు వచ్చినప్పుడే అది కొత్తకారుగా workshop నుండి వచ్చిన కారు అని చెప్పటానికి వీలవుతుంది. ఏ స్థితిలో పోయిందో ఆ కారు అదే స్థితిలో తిరిగి వెనుకకు వస్తే ఇంక workshopకు పోయి ప్రయోజనము ఏమిటి? కనుక మీరు ఈ Sathya sai institute అనే workshopకు వచ్చి చేరిపోయారు. నీ పాతవి, రోతవి అన్నీ ప్రక్కకు నెట్టివేయాలి. నూతనమైన భావాలు, జగత్తును ఉఱ్ఱూతలూగించే భక్తి ప్రపత్తులు నీలో అభివృద్ధి కావాలి. అప్పుడే ఇక్కడకు వచ్చినందుకు సార్థకమవుతుంది. లేకపోతే నీ కాలము వ్యర్థము, ఈ ధనము వ్యర్థము, ఈ చదువు వ్యర్థమూ. మానవత్వముకూడా సార్థకము కాదు. అలాంటి సార్థకము గావించుకునే జీవిగా మీరు తయారుకావాలని ఆశిస్తూ క్రమశిక్షణ తూచ నడచుకొనాలని ఆశిస్తూ నా ప్రసంగమును విరమిస్తున్నాను.

**(తేది. 23-06-1989న భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam